క్లుప్తంగా

15ఏళ్ల నుంచి రావణదహనం

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీలో 15సంవత్సరాలుగా దుర్గామాతను ప్రతిష్ఠించడంతోపాటు దసరా రోజున రావణాసురుడి భారీ కటౌట్‌ను దహనం చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో 9రోజులపాటు బతుకమ్మ సంబరాలను కూడా నిర్వహిస్తూ వచ్చారు. దేవరకద్రలోని పోచమ్మ ఆలయం వద్ద గతేడాది వరకు దుర్గామాతను ప్రతిష్ఠించి విజయ దశమి రోజు రావణుని కటౌట్‌ను పక్కనే ఉన్న రామ్‌లీలా మైదానంలో దహనం చేస్తూ వచ్చారు. ఈ ఏడాది భారీ వర్షాల కారణంగా దుర్గామాతను ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మండపంలో ప్రతిష్ఠించి శరన్నవరాత్రి పూజలు నిర్వహించారు. అయితే రావణుని కటౌట్‌ను యథావిధిగా రామ్‌లీలా మైదానంలోనే ఏర్పాటు చేస్తున్నారు. గురువారం శమీపూజ అనంతరం రామ్‌లీలా మైదానంలో దసరా సంబరాలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8గంటల ప్రాంతంలో రావణ దహనం కార్యక్రమం ఉంటుందని దసరా ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

విధి నిర్వహణలో కండక్టర్‌కు గుండెపోటు

గండేడ్: విధుల్లో ఉన్న ఓ కండెక్టర్ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సకాలంలో డ్రైవర్, ప్రయాణికులు స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా.. మహబూబ్‌నగర్ డిపోకు చెందిన బస్సులో కండక్టర్ సురేశ్ విధులు నిర్వర్తిస్తున్నాడు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ బస్సు మహబూబ్‌నగర్ నుంచి తాండూర్‌కు బయలుదేరింది. రెండున్నర గంటల ప్రాంతంలో గండేడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి గేట్ వద్దకు రాగానే కండక్టర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. విషయాన్ని గమనించిన ప్రయాణికులు, డ్రైవర్ సకాలంలో స్పందించి 108కు సమాచారం అందించారు. గండేడ్‌లో అందుబాటులో ఉన్న అంబులెన్స్ డ్రైవర్ చాంద్ తనకు సమాచారం అందడంతో ఈఎన్‌టీ జానకమ్మతో అక్కడికి వెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి చేరుకున్న కండక్టర్‌ను 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందిస్తూ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కండక్టర్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

నవాబుపేట: మండల కేంద్రంలో దేవీనవరాత్రుల సందర్భంగా బుధవారం శివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి రామేశ్వరయ్య ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య హోమం నిర్వహించారు. దీనికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రేమ్ సుధాకర్, సుధాకర్, అశోక్, శ్రీనివాస్, బాల్‌రాజ్, వేణునాథం, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న చెన్నారెడ్డి

అడ్డాకుల: నిరుపేదలు పండగలను సంతోషంగా జరుపుకోవాలనే ప్రతి ఏటా దసరా పండుగ ముందురోజు పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు కాంట్రాక్టర్ చెన్నారెడ్డి అన్నారు. మండలంలోని రాచాలలో బుధవారం ఆయన 245మంది మహిళలకు చీరలు, 45మంది వృద్ధులకు పంచెలను పంపిణీ చేశారు. అన్నివర్గాల ప్రజలు పండగను సంతోషంగా జరుపునేలా దాతలు ముందుకొచ్చి పేదలను ఆదుకోవాలని చెన్నారెడ్డి కోరారు. చెన్నారెడ్డి దాతృత్వంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రామురెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

గిన్నీస్ రికార్డు సాధించడంపై హర్షం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది కాలంలోనే డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తన శాఖతోపాటు పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌తో కలిసి తెలంగాణ అస్తిత్వ ప్రతీక అయిన ఎత్తైన బతుకమ్మను ఏర్పాటు చేసి గిన్నీస్ రికార్డు సాధించడంపై తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, శాంతారెడ్డి, కార్యవర్గ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2017లో ఆయన తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా ఉన్నప్పుడూ కూడా ప్రపంచ మహాసభలను దిగ్విజయం చేసినట్లు తెలిపారు.

విజయదశమికి ముస్తాబు



జడ్చర్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సమయబురమారెమ్మ అలంకరణ

- కిటకిటలాడుతున్న పట్టణ రోడ్లు
- తొలిసారిగా డిగ్రీ కళాశాల మైదానంలో రావణదహనం
- పట్టణమంతా విద్యుద్దీపాలతో అలంకరణ



జడ్చర్ల రైల్వే స్టేషన్‌రోడ్డులో నెలకొన్న రద్దీ

జడ్చర్ల టౌన్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపునకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని ఆయా ఉత్సవ మండపాల్లో వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలవిరాట్‌ను రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. ప్రాంగణంలో సమయబుర మారెమ్మగా దుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉత్సవ విగ్రహం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంటుంది.

ఇక శ్రీగిరిక్షేత్రంలో నవరాత్రుల సందర్భంగా నిత్యం నిర్వహిస్తున్న చండీహోమం బుధవారం ముగిసింది. అమావాస్య మొదలు మొత్తం 10రోజులపాటు కృష్ణస్వామి నేతృత్వంలో నిరాటంకంగా చండీహోమాలు జరిపించారు.

శమీపూజకు ఏర్పాట్లు

విజయ దశమిని పురస్కరించుకుని గ్రామాలు, మున్సిపాలిటీలో శమీపూజకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ ఆలయాలతోపాటు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల మైదానంలో శమీ పూజ జరిపించనున్నారు. ఇందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా పురస్కరించుకుని ఇప్పటికే పట్టణమంతా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు కొత్త శోభను తీసుకొచ్చాయి. వీధిదీపాలతోపాటు దసరా ప్రాభవాన్ని తెలియజేసేలా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఏర్పాటు చేసిన లైటింగ్ పట్టణవాసులతోపాటు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

రావణదహనానికి ఏర్పాట్లు

డిగ్రీ కళాశాల మైదానంలో తొలిసారిగా రావణదహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. శమీపూజ అనంతరం రాత్రి 8గంటలకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రావణదహనం చేయనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. పట్టణవాసులు సైతం పెద్ద ఎత్తున తరలిరావాలని వీహెచ్‌పీ పిలుపునిచ్చింది.

కిటకిటలాడుతున్న రోడ్లు

దసరా పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన, వ్యాపారకూడళ్లు కిటకిటలాడుతున్నాయి. స్టేషన్‌రోడ్డులో అడుగుతీసి అడుగు వేసేందుకు గగనంగా మారింది. వస్త్ర వ్యాపారాలు, కిరాణా దుకాణాలు, పిండి గిర్నీలు కొనుగోలుదారుతో నిండిపోయాయి. ఆర్టీసీ బస్సులు సైతం రద్దీగా మారాయి. ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారంతా పండగకు ఇళ్లకు చేరుకుంటుండడంతో బస్సులు, ప్రైవేట్ వాహనాలు నిండుగా వెళ్తున్నాయి. గురువారం దసరా అయినప్పటికీ గాంధీ జయంతి కావడంతో మాంసం, మద్యం విక్రయాలు నిలిపివేయడంతో ముందస్తుగానే కొనుగోళ్లు చేస్తుండడంతో వాటిలోనూ రద్దీ ఏర్పడింది.



రావణదహనానికి ఏర్పాట్లు చేస్తున్న కార్మికులు

మహిషాసురమర్దినిగా అలంకరణ



లక్ష్మీపల్లిలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



లక్ష్మీపల్లిలో కనకదుర్గాదేవిని మహిషాసుర మర్దనిగా అలంకరించిన దృశ్యం

దేవరకద్ర: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పదోరోజు దుర్గాదేవిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. దేవరకద్ర ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయ అవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అమ్మవారిని మహిషాసుర మర్దనిగా అలంకరించి పలువురు దంపతులు వ్రతాలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వర ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దిని అవతారంలో పూజలు చేశారు. మహిళలు సాముహిక కుంకుమార్చన చేశారు. దళితవాడలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వాసవీమాతకు పూజలు నిర్వహించారు. లక్ష్మీపల్లిలోని కనకదుర్గా ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో హోమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పూల బతుకమ్మ ఆటలతో మహిళలు, చిన్నారులు అలరించారు.

శాఖాంబరిదేవిగా పర్వాతాపూర్ మైసమ్మ

నవాబుపేట: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం పర్వతాపూర్ మైసమ్మ శాఖాంబరిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. మహార్ణవమి సందర్భంగా ప్రత్యేక అభిశేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

మహబూబ్‌నగర్ రూరల్: అధికార కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బుధవారం మండలంలోని బొక్కలోనిపల్లి, జమిస్తాపూర్, అల్లీపూర్, ఇప్పలపల్లి, గాజులపేటలో ఎంపీటీసీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కోసం ముఖ్య నాయకుల సమావేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గోవింద్‌యాదవ్, యాదయ్య, దాసు, బాలయ్య, వెంకటేశ్, సత్యనారాయణ, రఘు, బుచ్చన్న, వెంకటేశ్, అంజనేయులు, రవీందర్‌గౌడ్, ఊషన్న, శేఖర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

బస్‌స్టాప్ నిర్మించాలని కలెక్టర్‌కు వినతి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాతపాలమూరు వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలంటూ బుధవారం కలెక్టర్ విజయేందిర బోయిని మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొందరు స్థానికులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై గతంలో ఎమ్మెల్యే, ముడా చైర్మన్‌కు విన్నవించినా ఫలితం దక్కలేదన్నారు. కాగా, ఈ విషయమై ఆమె సానుకూలంగా స్పందించారని స్థానికులు చెబుతున్నారు. అక్కడ బస్‌స్టాప్ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారని వారు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాత ఊరేగింపు

భూత్పూర్: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం భక్తి శ్రద్ధలతో దుర్గామాతాను పట్టణంలోని వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారుల కోలాటాలు, నృత్యాలు, మహిళ బొడ్డెమ్మలు, పలువురిని ఆకట్టుకున్నాయి. వీధుల్లో ఊరేగింపు చేస్తున్న సమయంలో మహిళలు, చిన్నారులు నృత్యాలు, కోలాటాలు ఆడారు. కార్యక్రమంలో దుర్గామాతా ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాధిర్యాల్‌లో నిమజ్జనం

మహమ్మదాబాద్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గాధిర్యాల్‌లో అమ్మవారి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ముందు మహిళలు బతుకమ్మలు ఆడుతూ అందరినీ అలరించారు. యువతీ యువకులు దాండియా, భజన ఆటాపాటలతో ఆడుకుంటూ తీసుకెళ్లి అమ్మవారిని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్, వివేకానంద యూత్, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



భూత్పూర్‌లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

సైబర్‌నేరాలు, శాంతిభద్రతలపై అవగాహన

మహమ్మదాబాద్: నిత్యం సైబర్‌నేరాలతో మోసపోతున్న నేటిరోజుల్లో ప్రతి యువతీ, యువకులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో యువతీ, యువకులకు ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఏదో రూపంలో సైబర్ నేరాలతో ప్రజలు మోసపోతున్నారని అందుకు తగిన జాగ్రత్తలు వహించాలని బ్యాంకు ఖాతాల వివరాలు ఓటీపీలు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పరాదని తెలిపారు. గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొన్నందున ప్రజలు శాంతిభద్రతలు పాటించాలని సూచించారు. ఎన్నికల నింబధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలని తమ వర్గాలను ఎలాంటి అల్లర్లు చేయనీయకుండా తగిన అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆయా గ్రామాల ప్రయాణికులు పాల్గొన్నారు.



సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టుకున్న వెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. బుధవారం తన చాంబర్ నుంచి అధికారులతో నిర్వహించిన వీసీలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారని, మిగిలిన వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. జిల్లాలో జెడ్పీటీసీ, సర్పంచ్‌ల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ నవీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

భూత్పూర్: పట్టణంలోని రెండు రేషన్ షాపులను బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తనిఖీ చేశారు. రేషన్ షాపుల్లో బియ్యం లేకపోవడంతో అదనపు కలెక్టర్ మండలంలో ఇంతవరకు బియ్యం ఎందుకు పంపలేదని జడ్చర్ల స్టాక్ పాయింట్ డీటీని ఫోన్ ద్వారా ప్రశ్నించారు. వర్షాల కారణంగా ఆలస్యం జరిగిందని స్టాక్ పాయింట్ డీటీ చెప్పడంతో దసరా పండుగ సందర్భంగా భూత్పూర్ మండలంలోని అన్ని రేషన్ షాపులకు రాత్రి వరకు బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. డీలర్లు స్టాక్ పాయింట్ వద్దకు వెళ్లడంతో అదనపు కలెక్టర్ జడ్చర్ల స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి బియ్యాన్ని పంపించినట్లు డీలర్లు యాదయ్య, జానకిరాం తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట డీటీ మమత, భూత్పూర్ డీలర్లు ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

దేవరకద్ర: రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని డిప్యూటీ డీఎమ్‌హెచ్‌ఓ శశికాంత్ కోరారు. బుధవారం దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శరత్‌చంద్ర, మధుసూదన్‌రెడ్డి, ఓంకార్, కోటేశ్వర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మండల ఎన్నికల అధికారిగా తహసీల్దార్

నవాబుపేట: స్థానిక ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారిగా తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతరం మండల కేంద్రంలో ఎస్‌ఐ విక్రమ్, ఎంపీడీఓ జయరాంనాయక్‌తో కలిసి మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉందని అందరూ పాటించాలని సూచించారు. ఎన్నికల ని బంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు.

ఎంపీటీసీల నామినేషన్‌లకు సంబంధించి క్లస్టర్లు మండలంలో ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నవాబుపేటతోపాటు చౌడూర్, గురుకుంట ఎంపీటీసీ స్థానాల నామినేషన్లు స్వీకరిస్తారు. అలాగే కొల్లూర్‌లో కొల్లూర్, పోమాల్, కామారం, యన్మన్‌గండ్లలో యన్మన్‌గండ్ల, కొండాపూర్, కాకర్లపహడ్, కారుకొండలో తీగలపల్లి, కారుకొండ, కూచూర్, లోకిరేవులో ఇప్పటూర్, లోకిరేవు, కిషన్‌గూడ ఎంపీటీసీల నామినేషన్ల స్వీకరణకు అధికారులను నియమిస్తారు. మొత్తం 5క్లస్టర్లలో మూడు స్థానాల చొప్పున 15 ఎంపీటీసీ స్థానాల నామినేషన్లు స్వీకరిస్తారు.

లక్ష్యం వైపు ప్రయాణించాలి

- నూతనంగా ఎంపికైన మహిళా డీఎస్పీలకు ఘన సన్మానం



డీఎస్పీలుగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: ఈ కాలం అమ్మాయిలు, యువతులు భవిష్యత్ పరంగా ఎంచుకున్న లక్ష్యంవైపు క్రమశిక్షణతో ప్రయాణం చేస్తే తప్పక విజయం సాధిస్తారని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదలైన గ్రూప్–1 పరీక్ష ఫలితాల్లో డీఎస్పీలుగా ఎంపికైన భరోసా సెంటర్ ఎస్‌ఐ సుజాత, పట్టణానికి చెందిన ఖలా మక్సూద్ బయియాల్‌ను బుధవారం రాత్రి టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరై ఇటీవల డీఎస్పీలుగా ఎంపికైన ఇద్దరిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆ తర్వాత టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మహిళా పోలీస్ సిబ్బందితోపాటు పోలీస్ కుటుంబ సభ్యులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. టూటౌన్‌లో పనిచేసే సిబ్బంది కుటుంబ సభ్యులు అందరూ కలిసి పలు రకాల పాటలకు నృత్యాలు చేస్తూ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.

సామాజిక సేవ ప్రతిఒక్కరి బాధ్యత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సామాజిక సేవ ప్రతిఒక్కరి బాధ్యత అని రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ అన్నారు. సనాతన సారథి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ అనాథ శరణాలయం విద్యార్థులకు నోటు పుస్తకాలు, కాలేజీ బ్యాగులు, గ్రాఫ్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యాభివృద్ధికి సహకరించినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సనాతన సారథి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ సనాతన బాలరాజు, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, మోహన్‌గౌడ్, సుధీర్‌గౌడ్, హన్మంతు, రాఘవరెడ్డి, రఘు, నారాయణ, సువర్ణ, ఉమాదేవి, రమాదేవి, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయికి ఎంపిక

నర్వ: జాతీయ స్థాయి పోటీలకు నర్వ విద్యార్థిని ఎంపికైనట్లు రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. గ్రామానికి చెందిన చింతచెట్టు కృష్ణయ్య, లక్ష్మీ దంపతుల కూతురు రాధమ్మ ఇటీవల మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన 44వ, జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు తరఫున ప్రతిభ చాటిందన్నారు. నవంబర్‌లో యూపీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈమె పాల్గొంటుందన్నారు.